క్లుప్తంగా

గజ వాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రస్వామి



గజ వాహనంపై వీరభద్రస్వామి

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లెలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం 5గంటల నుంచి 10గంటల వరకూ, అనంతరం సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి గజ వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తుల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు వీరనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని, వెంటనే వాటిని గుర్తించి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ తెలిపారు. రాజుపాళెంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు కొంత భూమిని ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి న్యాయం చేయడంతో పాటు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. యూత్ నాయకులు బయ్యన్న, పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు అనంతపురం జేఎన్‌టీయూ విడుదల చేసిన బీటెక్ మొదటి సంవత్సరం సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అధిక జీపీఏ సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, డిప్లమో ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఆర్క్‌సాఫ్‌టెక్ ప్రైవేట్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు జయహర్షిత, భార్గవి, గీత, తేజస్విని, భవాని శంకర్, శ్రీకన్య, లక్ష్మీశ్రావ్య, ఆదినారాయణ, శివానంద్, దీపిక, నఫిష, సాయి, శైలజ, అయేషా, నమ్రతడైసీ, దివ్యశ్రీ, అన్షు, లిఖిత, హరిత తదితరులు ఎంపికయ్యారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

వారికి అనుమతి ఇవ్వొద్దు

పోరుమామిళ్ల : హిందూ ఆలయాల్లో అన్యమత చిహ్నాలు పెట్టి ప్రచారం చేస్తున్న వారికి అవకాశం ఇవ్వరాదని ధర్మవీర్ ఆధ్యాత్మిక చైతన్య వేదిక కోరింది. మంగళవారం పట్టణంలోని పురాతన శివాలయ కమిటీకి ఈ మేరకు ఓ విజ్ఞప్తి అందచేశారు. ధర్మవీర్ ఆధ్యాత్మిక చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ధర్మవీర్, పోరుమామిళ్ల మండల అధ్యక్షులు సుదర్శన్ ధర్మవీర్ మాట్లాడుతూ శ్రీమతం అని చెప్పబడే బ్రహ్మకుమారీలు పర్వదినాల్లో అన్యమత చిహ్నాలు పెట్టి ప్రచారం చేస్తున్నారన్నారు. శివరాత్రికి హిందూ ఆలయాల్లో అలాంటి వారికి అవకాశం కల్పించరాదని తాము ఆలయ యాజమాన్యాన్ని కోరామన్నారు.

న్యాయ పరిష్కారం జరగాలి

ప్రొద్దుటూరు క్రైం : కేసుల్లో సత్వర న్యాయ పరిష్కారం జరగాలని రెండో అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి తెలిపారు. మార్చి 8న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌పై ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, వారి న్యాయవాదులతో మంగళవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులతో మాట్లాడి కేసులు రాజీ చేయడానికి కృషి చేయాలన్నారు.

మల్లెంకొండేశ్వరాలయంలో భక్తుల రద్దీ



మల్లెంకొండకు చేరుకుంటున్న భక్తులు

గోపవరం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించే మల్లెంకొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు మల్లెంకొండకు చేరుకుంటున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతోపాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం బద్వేలు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కొండ దిగువ భాగం వరకు వాహనాల్లో చేరుకున్న భక్తులు అక్కడి నుంచి దాదాపు 7 కిలోమీటర్ల మేర కాలినడకన కొండపైకి నడవాల్సి ఉంటుంది. దాదాపు 25 వేల నుండి 30 వేల మంది వరకు ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు వస్తారని అధికారుల అంచనా. ఆలయ కమిటీ, దేవదాయశాఖ సమన్వయంతో ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో మంచినీరు, జనరేటర్ సౌకర్యం, అన్నదానం ఏర్పాటు చేశారు. అలానే ప్రత్యేక వైద్యశిబిరాలు అందుబాటులో తెచ్చారు. బ్రహోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పిస్తున్నారు.

విద్యా పునాదికి అంగన్‌వాడీలే కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

గోపవరం : విద్యా పునాదికి అంగన్‌వాడీలే కీలకమని ఎంపీడీఓ రామనాథరెడ్డి అన్నారు. మంగళవారం జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా బద్వేలు సెక్టార్‌లోని అంగన్‌వాడీలకు ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా రాబోయే రోజుల్లో సీపీ–1, సీపీ–2 తరగతుల విద్యార్థులకు బోధించే విధానంపై మంగళవారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు పునాది విద్యను పటిష్టంగా బోధించాలని సూచించారు. ఏదైనా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు అవసరముంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ముగింపు శిక్షణా కార్యక్రమంలో భాగంగా కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు. బద్వేలు ఎంఈఓ ప్రమీల మాట్లాడుతూ పునాది విద్యకు సంబంధించిన శిక్షణను అంగన్వాడీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, పీఆర్‌సీలు రవీంద్ర, ఆనంద్, రంతుల్లా, సూపర్‌వైజర్లు అరుణ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



బీబీ సాహెబ్‌పేటలో నువ్వుల పైరును పరిశీలిస్తున్న అధికారులు

అట్లూరు : చిరుధాన్యాల సాగు లాభదాయకం అని బద్వేలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, ఊటుకూరు ఏరువాక సమన్వయకర్త డాక్టరు అంకయ్య పేర్కొన్నారు. పొలం పిలుస్తుంది కార్యాక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కొండూరు, బీబీ సాహెబ్ పేట గ్రామాలలో సాగులో ఉన్న రాగి, నువ్వుల పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆయా పైర్లకు ఆశించిన తెగుళ్లను గుర్తించి నివారణ మందులను రైతులకు సూచించారు. అనంతరం కొండూరు రైతు సేవా కేంద్రంలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. అలాగే వేసవిలో పెసర సాగుతో భూసారం పెరగడంతోపాటు దిగుబడి బాగా ఉంటుందన్నారు. అలాగే పశువులకు గ్రాసంగా కూడా ఉపయోగపడుతుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు రామ్మోహన్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో బుధ, గురువారాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకూ రెండు రోజుల పాటు జరుగున్న వేడుకలకు ప్రతిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి దర్శనానికి ప్రత్యేకంగా భారీ కేడ్లను అమర్చామన్నారు. శివరాత్రి రోజైన బుధవారం జాగరణ సందర్భంగా తెల్లవారుజాము 3 గంటల నుంచి 5 వరకూ రుద్రాభిషేకం, బిల్వార్చన, లలితా సహస్రనామార్చనలు, 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ పాలాభిషేకం, సాయంత్రం 5గంటలకు యజమాన నందివాహనం ఊరేగింపు, 6గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఇదే క్రమంలో జాగరణకు వచ్చే భక్తుల కోసం రాత్రి 8గంటలకు తిరుపతి చిన్నవారి ఈవేంట్స్, సత్యహరిశ్చంద్ర ఉచిత నాటక ప్రదర్శన, కోలాటం, చక్క భజన కార్యక్రమాలు గలవు. భక్తులకు సౌకర్యవంతంగా చలువ పందిళ్లు, బారీమకేడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. మైదుకూరు, ప్రొద్దుటూరు నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నారు. మైదుకూరులోని మేధా, చిన్నగురువళూరులోని స్వామి వివేకానంద విద్యా సంస్థల బస్సులను ఆర్యవైశ్య సభ అన్న సత్ర అధ్యక్షులు దొంతు సుబ్రమణ్యం సహకారంతో బుధవారం ఉచితంగా భక్తుల కోసం బస్సులను ఏర్పాటు చేశారు.

నేడు శివపార్వతుల కల్యాణం

మైదుకూరు : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మైదుకూరులో శ్రీ పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. శివ రాత్రి సందర్భంగా ఆలయంలో బుధవారం ఉదయం సుప్రభాతం, గణపతి పూజ, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 5గంటల నుంచి శివపార్వతులు కళ్యాణం అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం శ్రీమాధయరాయ స్వామి యూత్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

భాషా వికాసం పెంపొందించాలి

చాపాడు : అంగన్వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారుల్లో శారీరక, భాషా, సామిజిక వికాసం పెంపొందించే అంశాల్లో అంగన్వాడీ వర్కర్ల పాత్ర కీలకమని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఆరు రోజులుగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. సీడీపీఓ సావిత్రమ్మ మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న విషయాలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, సుబ్బరత్నమ్మ, డీఆర్పీలు రిజ్వాన్ ఆలీ, శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పోరుమామిళ్ల : మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సూర్యకుమార్, మహబూబ్‌వలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 25 మందితో కమిటీని ఎన్నుకున్నట్లు భైరవప్రసాద్ తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎలక్ట్రీషన్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముందుగా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వంతో పోరాటం సాగిస్తామన్నారు.

భక్తులు జాగ్రత్తలు పాటించాలి

అట్లూరు : మహాశివరాత్రి సందర్భంగా లంకమల్ల రామలింగేశ్వరస్వామి శైవ క్షేత్రం, మల్లెంకొండకు వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలని బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్ తెలిపారు. లంకమల్లకు వచ్చే దారి ఇరుకుగా ఉన్నందున ద్విచక్ర వాహనాల్లో రావడం కంటే ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడం శ్రేయస్కరమని తెలియజేశారు. మల్లెంకొండ, లంకమల్ల శైవక్షేత్రాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలలో వచ్చే వారి వేర్వేరుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో అట్లూరు ఎస్‌ఐ రామకృష్ణ, బద్వేలు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు



అమృతేశ్వరస్వామి



విద్యుద్దీపాలంకరణలో అగస్త్యేశ్వరస్వామి ఆలయం

ప్రొద్దుటూరు కల్చరల్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అగస్త్యేశ్వరస్వామి, ముక్తిరామలింగేశ్వరస్వామి, అమృతేశ్వరస్వామి ఆలయాలతోపాటు పలు శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం నుంచి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారీకేడ్లను ఏర్పాటు చేశారు. అగస్త్యేశ్వరాలయంలో ఉదయం సుప్రభాత సేవతో మొదలుకుని మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, 10 గంటలకు శివపార్వతుల కళ్యాణోత్సవం, సాయంత్రం శివపార్వతుల గ్రామోత్సవం, రాత్రి 8గంటలకు కొవ్వూరు రమేష్‌రెడ్డి ధర్మపత్ని జయమ్మ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ, పూర్ణభాగవతారిణితో హరికథ, రాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి కోరారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరాలయంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం శివ పార్వతుల కళ్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి కోరారు. అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకతలింగేశ్వరునికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, నవరత్న లింగాలకు గంగా జలాభిషేకాన్ని నిర్వహించనున్నారు. అలాగే అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి సందర్భంగా పలు శివాలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాట్లు చేశారు.

మహిమాన్విత క్షేత్రం భైరవకోన

మైదుకూరు : మండలంలోని నల్లమల అడవుల్లో వెలసిన భైరవకోన మహిమాన్విత క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రంలో భైరవేశ్వర స్వామి కొలువైఉన్నాడు. శివరాత్రి పర్వదినాన ఈ క్షేత్రాన్ని దర్శించుకునేందుకు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తుతారు. పూర్వం భైరవ కొండయ్య అనే యువకుడు తన మేకలకు ఆవులకు తప్పిక తీర్చేందుకు నీటి సౌకర్యాన్ని కల్పిస్తే తన తలను నరికి ఆత్మార్పణ చేసుకుంటానని మొక్కుకున్నట్లు భైరవకోన క్షేత్రంపై చారిత్రక కథనం ప్రజల్లో ఉంది. ఈ విధంగా అక్కడ నీటి బుగ్గ పుట్టి మూక జీవాల దప్పికను తీర్చడంతో మొక్కు ప్రకారం కొండయ్య తన తలను నరుక్కుని ఆత్మార్పణ చేసుకున్నాడు. భైరవ కోన క్షేత్రంలో మండు వేసవిలోనూ ఇంకిపోని నీటి బుగ్గ ఇప్పటికీ ఉంది. భైరవేశ్వరుడిని ఆలయ ప్రాంగణంలో భైరవ కొండయ్య సమాధి కూడా ఉంది. లెక్కల వారిపల్లెకు చెందిన లెక్కల బాలిరెడ్డి ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేశారు. ఆయన వారసురాలిగా ఆయన కుమార్తె గిరిజ ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. భైరవకోనకు ప్రతి ఆదివారం ఎంతో మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. బుధవారం శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గుడిపాడు శివాలయంలో నేడు రుద్రాభిషేకం



శివాలయంలో పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న ఎలిశెట్టి వంశీయులు

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామంలో గల శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఎలిశెట్టి వంశీయులు శివరాత్రి సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఎలిశెట్టి వంశీయులతో శివపార్వతుల కళ్యాణం, లింగోద్భవ కాలంలో అభిషేకం అంత్యంత వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎలిశెట్టి మల్లికార్జున, నాగేశ్వరావులు తెలిపారు. పండగ రోజు రాత్రి భజన కార్యక్రమాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కావున భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఎలిశెట్టి కుటుంబ సభ్యులు కోరారు.

మహాదేవుడి దర్శనానికి ఆలయాల్లో ఏర్పాట్లు

కాశినాయన : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కత్తెరగండ్ల శివాలయం, అక్కంపేట విభూది శివాలయం, నరసాపురం శివాలయం, జ్యోతిక్షేత్రంలోని శివాలయాలను ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. కత్తెరగండ్ల శివాలయంలో తెల్లవారుజామున 3 గంటలకు శివలింగానికి అభిషేకం పూజలు చేయనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు శివపార్వతుల కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రాయలసీమకు 42 శాతం నిధులు కేటాయించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : రాయలసీమకు రాష్ట్ర బడ్జెట్‌లో 42 శాతం నిధులు కేటాయించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ మహమూద్ డిమాండ్ చేశారు. సృజన సామాజిక వేదిక కార్యాలయంలో ముద్రించిన కరపత్రాలను కడపలో మంగళవారం సాయంత్రం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మహమూద్ మాట్లాడుతూ ఏపీ విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేలా చూడాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకును కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.కృష్ణా రివర్ బోర్డును కర్నూల్‌లో ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో దాదాహయత్, ఎల్లయ్య, వరలక్ష్మి, పద్మ, తవ్వా సురేష్, వడ్ల లక్ష్మీదేవి, హరిత, సుబ్బయ్య, దస్తగిరి, శ్రీనివాసులరెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియా నియంత్రణలో విఫలం

బద్వేలు అర్బన్ : మెడికల్ మాఫియాను అరికట్టడంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు విఫలమయ్యారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని ఆరోపించారు. మంగళవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు చిన్నచిన్న జబ్బులకు మెడికల్ షాపులను ఆశ్రయిస్తుంటే వారు అవసరం ఉన్నా లేకున్నా మందులను అంటగట్టి పేదల జేబులు ఖాళీ చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల కొరత, జనరిక్ మందుల షాపులు లేని కారణంగా మెడికల్ షాపుల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తరచూ మెడికల్ షాపులను తనిఖీ చేస్తూ వారి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షుడు యువరాజ్, రూరల్ కార్యదర్శి బాలగురయ్య తదితరులు పాల్గొన్నారు.